సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

భక్తజన సేవలో..

- అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- దారి పొడవునా సేవా కార్యక్రమాలు



రోడ్డుపై ప్రసాదం వేయొద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: అప్పన్న సింహగిరి ప్రదక్షిణ ఊహకందని వైభవంలా సాగింది. తీవ్రమైన ఎండ ఉన్నప్పటికీ గొడుగులు వేసుకొని అప్పన్న నామస్మరణ చేస్తూ.. దారి పొడవునా స్వచ్ఛంద సంస్థలు అందించిన ప్రసాదాలు తింటూ సింహాచలం కొండ చుట్టూ 32 కిలోమీటర్లు అవలీలగా చుట్టేశారు. హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ మీదుగా జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్ వరకు బీచ్ రోడ్డులో భక్తులు నడక సాగించారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులు పలచగా కనిపించినా.. ఆ తర్వాత నుంచి చిన్నాపెద్దలు, యువతతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. భక్తుల నడకతో వాహనాలు కదల్లేని పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జెడ్సీ కనక మహలక్ష్మి నిరంతరం పర్యవేక్షించారు.

స్వచ్ఛందంగా ప్రసాద వితరణ

భక్తుల ఆకలి తీర్చడానికి దాతలు ముందుకొచ్చారు. పైనాపిల్ కాలనీ నుంచి జోడుగుళ్లపాలెం వరకు స్వచ్ఛంద సేవా సంస్థలు, గ్రామ సంఘాలు, వివిధ ఆలయాల నిర్వాహకులు, పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, పులిహోరా, తాగు నీరు, మజ్జిగ, టీ, చక్కెర పొంగలి, శనగలు పంపిణీ చేశారు. జీవీఎంసీ, సింహాచలం దేవస్థానం అధికారులు పలుచోట్ల తాగునీరు సరఫరా చేశారు.

- స్వచ్ఛంద సంస్థల ప్రసాద వితరణ కేంద్రాల్లో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో పాటు 9, 10, 12, 13 వార్డుల కార్పొరేటర్లు స్వాతి, మద్దిల రామలక్ష్మి, అక్కరమాని రోహిణి, కెల్ల సునీత భక్తులకు ప్రసాదం అందించారు.
- పైనాపిల్ కాలనీలో ఉడ్ డెకార్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోరా, తాగు నీరు అందజేశారు.
- విశాఖ కేంద్ర కారాగారం వద్ద జైల్, ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది పులిహోర, శనగలు, బిర్యానీ, టీ, తాగునీరు సరఫరా చేశారు.
- ముడసర్లోవ వద్ద మామిడి తోటలో విశ్వాస్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, పరమాన్నం, మజ్జిగ, తాగునీరు, మందులు అందజేశారు.
- ముడసర్లోవ వద్ద ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు బూరెలు, పులిహోర, నీరు, మజ్జిగ, ఉడకబెట్టిన శనగలు అందించారు. ఇదే ప్రాంతంలో ఆరిలోవ మెడికల్ షాపుల అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మిరియాల పాలు, మందులు, తాగునీరు సరఫరా చేశారు.
- చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరంలో భక్తులకు అన్నదానం చేశారు. పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, కైలాసగిరి కూడలి, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా సంఘాలు ప్రసాదం పంపిణీ చేశాయి.



అప్పుఘర్‌లో వైఎస్సార్‌సీపీ శిబిరంలో భక్తులకు వాటర్ బాటిళ్లు అందిస్తున్న అక్కరమాని వెంకటరావు తదితరులు

భక్తుల సేవలో పోలీసులు

పైనాపిల్ కాలనీ నుంచి హనుమంతవాక మీదుగా విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు బీచ్ రోడ్డు వరకు 150 మంది పోలీసులు సేవలందించారు. ట్రాఫిక్ పోలీసులు జీపుల్లో నిరంతరం తిరుగుతూ ఎక్కుడా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్రా. వాహన రాకపోకలకు ఒకే లైన్ కేటాయించారు. హనుమంతవాక, జోడుగుళ్లపాలెం కూడళ్లలో అధిక సంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహించి భక్తులకు, ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా చూశారు.



అప్పుఘర్‌లో భక్తులకు అల్పాహారం అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

అప్పుఘర్ తీరం.. జనసంద్రం

ఎంవీపీ కాలనీ: సింహాచలం గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులతో అప్పుఘర్ సముద్ర తీరం పులకించింది. గిరిప్రదక్షిణలోని ముఖ్యమైన ప్రాంతాల్లో అప్పుఘర్ ఒకటి కావడంతో పెద్ద ఎత్తున ఇక్కడికి తరలివచ్చారు. తెన్నేటి పార్కు మీదుగా ఈ తీరానికి చేరుకొని పెద్ద ఎత్తున సముద్రస్నానాలు ఆచరించారు. భక్తుల కోసం ఇక్కడ ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. నేరుగా వారు సముద్రంలోకి వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో తాగునీరు, ఔషధాలు పంపిణీ చేశారు. 108, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మతోపాటు జీవీఎంసీ జోన్–3 అధికారులు అప్పుఘర్ కూడలిలో పర్యటించి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. అప్పుఘర్‌లో భక్తులకు కలెక్టర్ మల్లికార్జున అల్పాహారం అందజేసి పలు సూచనలిచ్చారు.



అప్పుఘర్ తీరంలోస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

భక్తుల సేవలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తుల సౌకర్యార్థం వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ శ్రేణుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. ఆరిలోవ పెదగదిలి సెంటర్‌లో మెడికల్ క్యాంప్, ప్రసాద పంపిణీ కార్యక్రమాల్లో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, గొలగాని శ్రీనివాస్, ధూళి రఘు తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన బీఆర్‌టీఎస్ రోడ్డు



బీఆర్‌టీఎస్ రోడ్డులో భక్తులకు ప్రసాదం అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, అక్కరమాని వెంకటరావు

- జోడుగుళ్లపాలెం కూడలిలో కార్పొరేటర్ ఉమ్మిడి స్వాతి ఆధ్వర్యంలో అక్కరమాని వెంకటరావు భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఉమ్మిడి దాసు తదితరులు పాల్గొన్నారు.
- 18వ వార్డు అప్పుఘర్ కూడలిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు వేరు వేరు కౌంటర్ల ద్వారా పులిహోర, దద్దోజనం, వాటర్ బాటిళ్లు, మజ్జిగ, టీ పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ 18వ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మితోపాటు పలువురు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అక్కరమాని వెంకటరావు భక్తులకు అల్పాహారం అందజేశారు. పార్టీ నాయకులు పుక్కళ్ల శంకర్, ఎల్లాజీ, కల్యాణ్, జ్యోతి, సత్యవతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో బీజేపీ ఆరిలోవ మండల అధ్యక్షుడు మధుపాడ సన్యాసిరావు ఆధ్వర్యంలో మజ్జిగ, జండుబామ్ పంపిణీ చేశారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

సేవాతత్పరులు..

ఎంవీపీకాలనీ: గిరిప్రదక్షిణలో భాగంగా భక్తులకు అల్పాహారాన్ని అందించేందుకు నగర యువకులతో కూడిన స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ హేండ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎంవీపీ కాలనీ కూడలిలో భక్తులకు వేడివేడి బాదం మిల్క్‌తో పాటు అల్పాహారాన్ని అందించింది. భక్తుల్లో ఉత్సాహాన్ని, శక్తిని పెంచేందుకు పప్పు చెక్కీలు, బిస్కెట్లు పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. 25 వేల మంది భక్తులకు సరిపడా బాదం పాలుతో పాటు చెక్కిలు ఇతర ఎనర్జీ పానీయాలను పంపిణీకి ఉంచినట్టు సంస్థ సభ్యులు వెల్లపు వెంకటేష్, ఆచంట వెంకట గణేష్, వెచ్చలపు గోవింద్, రెహ్మాన్ తదితరులు వెల్లడించారు.



భక్తుల సేవలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు



ఏయూ విద్యార్థుల సేవా కార్యక్రమం

- ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీటెక్, పీజీ చదువుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విశాఖ వచ్చిన యువకులు గిరిప్రదక్షిణలో ఉన్న భక్తుల సేవలో భాగస్వాములయ్యారు. వారంతా కలిసి సమకూర్చుకున్న నిధులతో పులిహోర, మజ్జిగ, మంచినీటిని భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు వీరు భక్తులకు సేవలందించారు.

క్లుప్తంగా

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో



అప్పుఘర్ వద్ద ఉచిత వైద్య శిబిరంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అప్పుఘర్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదివారం సందర్శించారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా 32 కిలో మీటర్ల పొడవునా మొత్తం 31 వైద్య బృందాలు, 16 అంబులెన్సులను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు ఈ వైద్య బృందాలు ప్రజలకు అందుబాటు ఉంటాయి. అక్కడ వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. అలాగే ఆ రహదారిలో వెళ్తున్న భక్త జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ విజయనిర్మల, కార్పొరేటర్ శ్రీవిద్య

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో సీసీ రోడ్డు, డ్రెయిన్‌ల నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, మున్సిల్ లీగల్ కౌన్సిల్ సభ్యుడు అడ్వకేట్ అప్పారి గిరిబాబుతో కలసి ఆదివారం కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికుల అభ్యర్థన మేరకు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్‌లను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈఈ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, పార్టీ స్థానిక నాయకులు నరాల సత్తిబాబు, బుగత ఏసురత్నం, వెంకటలక్ష్మి, నారాయణరావు, వెంకటరావు, రాజారావు, అచ్యుతలు పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగి అదృశ్యం



ధీరజ్‌కుమార్

మల్కాపురం: ఓ యుద్ధనౌకలో సెయిలర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అదృశ్యం అయ్యాడు. తూర్పు నౌకాదళం విభాగంలో ఎస్ఎస్ వీరబాహు నౌకలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ (28) ఈ ఏడాది జనవరిలో సెయిలర్‌గా (ఆర్ఎంఎస్ ర్యాంక్) చేరాడు. వీరికి ఆ నౌకలోనే భోజనం, వసతి సదుపాయం వంటివి అధికారులు కల్పిస్తారు. విధులు అనంతరం ప్రతి రోజు సాయంత్రం వీరు అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి వస్తుండేవారు. ధీరజ్ శనివారం సాయంత్రం విధులు ముగించుకొని అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తోటి సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు అతడి ఆచూకీ కోసం నౌకాపరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఫలితం లేకపోవటంతో ఆదివారం నేవీ లెఫ్టినెంట్ కమాండర్ సుశీల్ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ ఎస్ఎస్ సింధూకేసరి నౌక వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఇన్, అవుట్ గేట్ల వద్ద గల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

బాబా పాద దర్శనం నేడు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయినాథుడి మందిరంలో సోమవారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు జరుగుతాయని, సాయి నాథుడి పాద దర్శనం కల్పిస్తామన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికుల జీతాలు తక్షణం పెంచాలని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి కోరారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో దిబ్బపాలెం పెద్దమ్మోరు ఆలయం వద్ద నుంచి పోర్టు వంతెన జంక్షన్ వద్ద గల గాంధీ విగ్రహం వరకూ ఆదివారం కుటుంబాలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఆపాలన్నారు. వారికి నెలకు రూ. 36 వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల నుంచి అక్రమంగా తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న కార్మికుల పిల్లలు అదానీ తాతయ్య మా నాన్న జీతాలు పెంచవా అంటూ ప్లకార్డులు ప్రదర్శించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాగరతీరంలో సందడి



రుషికొండ బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: ఉదయం నుంచి ఉక్కపోత, గాలి లేక ఎర్రటి ఎండతో ఇబ్బంది పడిన నగరవాసులు ఉపశమనం పొందేందుకు ఆదివారం సాయంకాలం సాగరతీరాన్ని ఆశ్రయించారు. భానుడు భగభగమంటూ నిప్పులు చెరగడంతో గంటల తరబడి సముద్రాల్లో స్నానాలు చేసేందుకు పర్యాటకులు, నగరవాసులు ఆసక్తి కనబరిచారు. ఆర్కేబీచ్, భీమిలి, సాగర్‌నగర్, రుషికొండ తీరంలో పర్యాటకుల తాకిడి పెరిగింది.

ప్రభుత్వ హాస్టళ్లలో ప్రవేశాలకు అవకాశం

మధురవాడ: మధురవాడ కరెంటు ఆఫీసు సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం, కళాశాల బాలుర వసతి గృహాల్లో చేరేందుకు వార్డెన్‌లను సంప్రదించాలని ఏఎస్‌డబ్ల్యూవో టి.సత్యనారాయణ కోరారు. వివరాలకు 98499 39100లో సంప్రదించాలని కోరారు.

బీసీల అభ్యున్నతికి కృషి చేయాలి



రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న నాయకులు

మద్దిపాలెం: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఏబీసీఎఫ్ జాతీయ కార్యదర్శి ఆల్మన్‌రాజు అన్నారు. ఈ మేరకు 51వ వార్డు మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవహక్కుల సంఘం ఆంధ్ర ప్రదేశ్ శాఖతో సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో జాతీయ స్థాయిలో వెనుకబడిన తరగతుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనేక జాతీయ అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బీసీ జనగణన కులాల వారీగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తీర్మానించామన్నారు. సమాజంలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాజకీయ పార్టీలకు మనుగడ లేకుండా చేయాలన్నారు. జాతీయ స్థాయిలో ఈబీసీ, ఎంబీసీ కుల గణన వంటి అంశాలను లేవనెత్తుతూ రాజీలేని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకత్వంలో బీసీ ఉద్యమం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రోత్సహించిన రాజకీయ పార్టీలను మాత్రమే ఆదరించాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్‌రావును ఏబీసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య పంపిన ఉత్తర్వులను ఆల్మన్‌రాజు అందజేశారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ బీసీల సమస్యలపై జాతీయ స్థాయిలో రాజీలేని పోరాటం చేస్తున్న యోధుడు జస్టిస్ ఈశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, పైడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో జీవో 32 అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, నాయకులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియలో జీవో 32ను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు కోరారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని ఎన్జీవో హోంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, రేడియోగ్రాఫర్లు, హెడ్ నర్సుల జీత భత్యాల చెల్లింపులో సమస్య వచ్చే అవకాశం వుందని, దానిని తక్షణం పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రతి పీహెచ్‌సీకి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, నైట్ వాచ్‌మేన్‌ను నియమించాలన్నారు. ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం ద్వారా ఈ సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై టమాటాల విక్రయం



ఎంవీపీ రైతుబజార్‌లో సబ్సిడీ టమాటాల కోసం క్యూలో జనం



వినియోగదారుడితో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

ఆరిలోవ: రైతుబజార్లలో సబ్సిడీపై టమాటాలు సక్రమంగా విక్రయించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. నగరంలోని సీతమ్మధార, ఎంవీపీకాలనీ, గోపాలపట్నం రైతు బజార్లలో ఆదివారం సబ్సిడీపై టమాటాలు విక్రయించారు. ఈ సందర్భంగా ఎంవీపీ రైతు బజార్‌ను ఆదివారం జేసీ సందర్శించారు. టమాటాల ధర విపరీతంగా పెరడగంతో ప్రభుత్వం స్పందించింది. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా రైతు బజార్లలో సబ్సిడీపై ఆదివారం నుంచి విక్రయాలు ప్రారంభించింది. ఎంవీపీ, సీతమ్మధార రైతు బజార్లలో 6 క్వింటాలు, గోపాలపట్నం రైతు బజార్‌లో 5 క్వింటాలు చొప్పున విక్రయాలు జరిపారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా స్టాళ్ల వద్ద క్యూ ఏర్పాటు చేయాలని ఈవో జి.ప్రసాద్‌ను జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. ఆధార్ కార్డు ఉన్న వినియోగదారులకు సబ్సిడీ టమాటాలు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, సిబ్బంది పాల్గొన్నారు.

బారులు తీరిన వినియోగదారులు

ఎంవీపీకాలనీ, సీతమ్మధార, గోపాలపట్నం రైతు బజార్లలో సబ్సిడీపై విక్రయించే టమాటాల కోసం జనం బారులుదీరారు. బయట మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.85కు టమాటాల ధర ఉండడంతో వినియోగదారుడిపై భారం పెరిగింది. దీంతో సబ్సిడీపై కిలో రూ50కు విక్రయాలు జరపడంతో రైతు బజార్లకు వినియోదారులు భారీగా తరలివచ్చారు.

నవ్వుల్లో ముంచెత్తిన కామెడీ స్కిట్లు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ఆద్యంతం నవ్వులు పూయించింది. కామెడీ ఆర్టిస్టులు జబర్దస్త్ ప్రకాష్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, రావి గోపీకృష్ణ, భానుప్రకాష్, శివజ్యోతి, అన్వేష, దామోదర్, ఇమంది ఈశ్వరరావు, జి.వి.త్రినాథ్, బుగత సత్యనారాయణ, శ్రీధర్, పుష్యమి, మల్లిక, పోర్టు శేషులు ప్రదర్శించిన స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. ఫోన్ చేసి మరీ అడగాల, కుక్క కరిచింది, కుక్కను అమ్మేస్తా, రక్తం, ఆర్టీసీ బస్సు, ఎఫ్4, స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ సందర్భంగా కళాకారులను నండూరి రామకృష్ణ, ఎ.వి.రామకృష్ణ, దాసరి సాంబశివరావు తదితర అతిథులు సత్కరించారు.

ప్రత్యేక అలంకరణలో సాయి



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో షిర్డీసాయిబాబా

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబ దేవాలయం గురుపౌర్ణమి వేడుకలను సిద్ధమైంది. సోమవారం బాబాను పూలతో ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం, 8.30కు ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు బాబాకు 300 కిలోల అన్నంతో అభిషేకం చేస్తారు. సుదర్శన హోమంలో పాల్గొనే భక్తులు రూ.516, అన్నాభిషేకానికి రూ.200 రుసుం చెల్లించి రసీదు పొందాలని నిర్వాహకులు కోరారు.

ఉద్యమాలకు ప్రేరణ.. 'ది మ్యాంగో లేడీ'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి, ఆచార్య చలం

సీతంపేట: ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చే నవల 'ది మ్యాంగో లేడీ' అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ దినపత్రిక సబ్ ఎడిటర్ మళ్లాజోస్యుల అనుపమ పద్మజ రచించిన ది మ్యాంగో లేడీ ఇంగ్లిష్ నవల పుస్తకావిష్కరణ సభ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సోంపేట పోరాట యోధురాలు జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.నళిని పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.ఎస్.చలం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళి, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసులు ప్రసంగించారు. ఉత్తరాంధ్ర వర్తమాన, సామాజిక జీవితపు వాస్తవ చిత్రీకరణ ఈ నవలలో రచయిత్రి చక్కగా పొందుపర్చారని వక్తలు పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు పలు సూచనలిచ్చారు. ఎటువంటి తగాదాలు, గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీసులు అప్పగించారు.

ఫోర్త్ టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలు జోలికి పోవద్దన్నారు.

శ్రీధర్‌కు సత్కారం

సీతంపేట: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని గౌతమ్ బుద్ధ యూనివర్సిటీలో జరగనున్న కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు నగరానికి చెందిన ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉద్యోగి వి.శ్రీధర్ టెక్నికల్ ఆఫీషియల్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను విజయాంధ్ర వ్యాయామ మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. బుల్లయ్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, ఎం.ప్రభాకర్‌రావు, స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కోటేశ్వరరావు, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి.సంజీవ్ ప్రవీణ్, శివకుమార్, వెంకటరావు తదితరులు శ్రీధర్‌ను అభినందించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

NEW దీపక్ పంజాబి డాబా
Deepak PUNJABI DHABA
MULTI CUISINE RESTAURANT VEG & NON VEG
Indian, Chinese, Tandoori, Biryani
Home Delivery Online Orders : Swiggy, Zomato
Sankaramatam Road, Near Income Tax Office, Santipuram, Visakhapatnam. Cell : 6262616868, Ph : 0891-3585195

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com